Andhra Bhoomi                                                                 Dt 03/06/18.



### ఎల్‌బీనగర్-అమీర్‌పేట రూట్‌లో

# త్వరలో 'మెట్రో' ట్రయల్ రన్

- అమీర్‌పేట-హైటెక్‌సిటీ పనులు మరింత వేగవంతం
- మెట్రోరైలు ఎండీ డా.ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్,జూన్ 2: నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమయ్యే మహానగరవాసులకు ఇప్పటికే రెండు కారిడార్లలో 30 కిలోమీటర్ల మేరకు అందుబాటులోకి వచ్చిన మెట్రోరైలు త్వరలోనే ఎల్‌బీనగర్-అమీర్‌పేటల మధ్య సుమారు 16 కిలోమీటర్ల పొడువున పరుగులు తీయనుంది. ఇందుకు సంబంధించి త్వరలోనే ఈ రూట్‌లో ట్రయల్ రన్ కూడా నిర్వహించనున్నట్లు మెట్రోరైలు ఎండీ డా.ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భవ వేడుకలను ఆయన శనివారం బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో నిర్వహించారు. తొలుత ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే అమీర్‌పేట-హైటెక్ సిటీ రూట్‌లో 10 కిలోమీటర్ల మెట్రో ప్రయాణాన్ని అందుబాటులోకి తెస్తామని, త్వరలోనే ఇక్కడ కూడా మెట్రోట్రయల్ రన్‌ను నిర్వహించనున్నట్లు, ఈ దిశగా పనులను మరింత వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్‌లో మెట్రోరైలు లాంటి భారీ ప్రాజెక్టును అందుబాటులోకి తేవటం మొట్టమొదటి సారి అని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టును ప్రతిపాదనల స్థాయి నుంచి పట్టాలపై పరుగులు తీయించేందుకు ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, ఎన్నో సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుని, నేడు ప్రపంచ అభినందించేలా మెట్రోరైలు ప్రాజెక్టును అందుబాటులోకి తేవటంతో పాటు అభివృద్ధి అజెండాలో మెట్రోరైలును బెంచ్ మార్క్‌గా నిలిపామన్నారు. దీంతో పాటు సికిందరాబాద్ జూబ్లీబస్ స్టేషన్ నుంచి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ వరకు మరో పది కిలోమీటర్ల మెట్రోరూట్‌లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డీఎంఎస్ రాజు, చీఫ్ ఇంజనీర్ పంచమ్, చీఫ్ సిగ్నలింగ్, టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్ కె. లక్ష్మణ్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ బి.ఆనంద్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మెట్రోరైలు భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎండీ డా.ఎన్వీఎస్ రెడ్డి